రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

రసూల్‌పురా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. బాలంరాయి లీ ప్యాలెస్‌లో రేషన్‌కార్డుల పంపిణీ ఏర్పాట్లను కాంగ్రెస్ నేతలతో కలసి శ్రీగణేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, పీసీసీ సెక్రటరీ రాజేష్ యాదవ్, ముప్పిడి మధుకర్ పాల్గొన్నారు.

ఆర్యనగర్ సమస్యలు పరిష్కరిస్తాం



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్యనగర్ వాసులు

సికింద్రాబాద్: తార్నాక డివిజన్ సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ హామీ ఇచ్చారు. గురువారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆర్యనగర్ వాసులు వినతిపత్రం అందించారు. తమబస్తీలో పోలీసుగస్తీని పెంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్యనగర్ కోరారు. రహదారి నిర్మాణం, కమ్యూనిటీహాలు నిర్మాణం పనులు సత్వరమే పూర్తిచేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మాట్లాడుతూ అధికారులను అప్రమత్తం చేసి ఆర్యనగర్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు షాను, హరికృష్ణ తదితరులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు.

వెలగని వీధిలైట్లు.. ప్రజల ఇబ్బందులు

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న విద్యుత్ దీపాలు అలంకారప్రాయంగా మారాయి. నెల రోజుల నుండి లైట్లు వెలగక పోవడంతో వాహనచోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా ఏర్పడ్డ గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈఎస్ఐ ఆసుపత్రి నుండి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రికి రోడ్డులో కొద్ది చీకటి పడిదంటే చాలు ఈ మార్గంలో నడిచి వెళ్లలేని సరిస్థితి నెలకొంది. అధికారులు తగిన చర్యలు తీసుకొని విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన

లాలాపేట: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ అప్పుడే నేరాలను అదుపు చేయగల్గుతామనీ లాలాగూడ పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్‌పెక్టర్ అమర్ సింగ్ అన్నారు. ఈ మేరకు గురువారం తార్నాక విజయపురి కాలనీలో కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 100 డయల్, సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, మహిళా భద్రత, ఇతర నేరాలకు సంబంధించిన విషయాలపై ప్రజలను ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. ఈ కార్యక్రమంలో లాలాగూడ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌తోనే శాంతి చర్చల ప్రస్తావన

ఉస్మానియా యూనివర్సిటీ: నక్సలైట్ల ఏరివేతకు కేంద్రం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌తోనే శాంతి చర్చల ప్రస్తావన ఆరంభమైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం మైత్రిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎంఎంఆర్ఐ) ఆధ్వర్యంలో ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో నక్సల్స్ నరమేథం-మేధోమథనం పై అంశం పై సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఎంఎంఆర్ఐ అధ్యక్షులు డా.మురళిమనోహర్ అధ్యక్షత వహించగా రిటైర్డ్ ఏఎస్పీ పానుగంటి చంద్రమౌళి, ఏబీవీపీ జాతీయ నాయకులు బాలకృష్ణ, న్యాయవాది సురేందర్ రావు, బాపూరావు, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, మేథావులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పాదయాత్రను జయప్రదం కావాలి

శ్రీనగర్‌కాలనీ: ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రారంభించిన జనహిత పాదయాత్ర జయప్రదం కావాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు నవీన్‌యాదవ్ ఆకాంక్షించారు. పరిగిలో గురువారం ప్రారంభమైన జనహిత పాదయాత్రకు మద్దతుగా నవీన్‌యాదవ్ వెళ్లి మీనాక్షి నటరాజన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల వలయంలో ఇందిరానగర్

నాలా నిర్మాణం పనులు నత్తనడక
- ప్రారంభంకాని రోడ్డు పనులు
- నీటమునుగుతున్న రహదారులు
- మూడు నెలలుగా ప్రమాదకర పరిస్థితులు



నత్తనడకన నడుస్తున్న ఇందిరానగర్ నాలా నిర్మాణం పనులు



ప్రమాదకరంగా పరిణమించిన ఇందిరానగర్ 2వ నెంబర్ రహదారి

సికింద్రాబాద్: ముందుకు సాగని నాలా అభివృద్ధి పనులు, ప్రారంభంకాని రోడ్డు నిర్మాణం పనులు సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్ ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. అంతేకాదు ప్రమాదం బారిన పడేస్తున్నాయి. ఒకవైపు ఈ ప్రాంతం ముంపునకు గురికాకుండా ఉండేందుకు రూ.90 లక్షలతో నిర్మిస్తున్న వరదనీటి కాల్వ (నాలా) పునర్నిర్మాణం పనులు మొదటి నుంచీ నత్తనడకన నడుస్తున్నాయి. రోడ్డు తవ్వేయడం, నిర్మాణ పనుల్లో తీవ్రంగా జాప్యంతో కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందుల పాలవుతున్నారు. మరోవైపు కాలనీ 2వ నెంబర్ రహదారి నిర్మాణం పనులకు ప్రారంభోత్సవం చేసి ఎనిమిదేళ్లు దాటింది. అయినా నేటికీ రహదారి నిర్మాణం పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఈ రహదారి సైతం ప్రమాదాలకు హేతువుగా మారింది.

నాలా నిర్మాణం తీరు....

వర్షం కురిసిన ప్రతీసారి ఇక్కడి రహదారులు ఆసాంతం వరదనీటితో నిండిపోవడం, ఇండ్లలోకి నీరు చేరడం ఇందిరానగర్‌లో పరిపాటిగా మారింది. ఈ సమస్యను అధిగమించడానికి వరదనీటి కాల్వ నిర్మాణం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనులు ప్రారంభించిన రోజు నుంచి ఇప్పటి వరకు నత్తనడకన నడుస్తున్న నాలా నిర్మాణం పనులు ఎట్టకేలకు చివరిదశకు చేరాయి. తుదిదశ నిర్మాణం పనులు రెండు నెలలుగా ఒకటవ నెంబర్ రోడ్డు వాసులకు ప్రమాదకరంగా పరిణమించాయి.

▲ నాలా నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టి రెండు నెలలు కావస్తోంది. నిర్మాణం సమయంలో తవ్విన మట్టిని రోడ్డుకు ఒకవైపు కుప్పలుగా పోసి అలాగే ఉంచారు. ఒకవైపు మట్టి కుప్పలు, మరోవైపు నిర్మాణం కోసం రహదారిపై తవ్వకాలు చేపట్టిన తీరుతో స్థానికులు అడుగుతీసి అడుగెయ్యలేని ప్రమాదకర పరిస్థితి నెలకొంది. స్థానికులు అక్కడి గృహాల నుంచి రోడ్డు మీదకు రావడం కోసం తాత్కాలికంగా అమర్చిన చెక్కలపై సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుంది. నిర్మాణం పనుల్లో కనీస నాణ్యత ప్రమాణాల లేకపోయినా అధికారులు చూసీచూనడట్టు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు చెబుతున్నారు.

ప్రమాదకరంగా రహదారి...

ఇందిరానగర్ 2వ నెంబర్ రహదారి మొత్తంగా గుంతలమయంగా మారింది. ఇక్కడ కొత్త రహదారి నిర్మాణం కోసం గత ఏడాది జీహెచ్ఎంసీ అధికారులు రూ.25 లక్షలు కేటాయించారు. ఈ ఏడాది జనవరి మొదటివారంలో నిర్మాణం పనులకు స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమ ప్రారంభోత్సవం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం పనులు మొదలు పెట్టిన దాఖలాలు లేవు. ఇటీవలి వర్షాలకు రోడ్డు మరింత ప్రమాదకరంగా పరిణమించింది. ఒకటి, రెండవ రహదారులు ప్రమాదకర పరిస్థితుల్లో ఉండడంతో ఇక్కడి ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు.

▲ రెండవ నెంబర్ రోడ్డులో కొత్తదారి నిర్మాణం సమయంలో జలమండలి అధికారులు మెలికపెట్టడంతో నిర్మాణం పనులు నిలిచిపోయాయి. తాము ఇక్కడి భూగర్భం గుండా వాటర్‌లైన్స్ వేయాల్సి ఉందని, వాటర్‌లైన్స్ వేశాక రోడ్డు వేసుకోవాలని జలమండలి అధికారులు చెప్పడంతో రోడ్డు పనులు నిలిచిపసోయాయి. పైప్‌లైన్ నిర్మాణం కోసం నిధులు విడుదలకాకపోవడంతో ఆ నిర్మాణం పనులు చేపట్టలేదు. ఫలితంగా రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయాయి.

త్వరలో అభివృద్ధి పనులు పూర్తి



నాలా నిర్మాణం పనులు చివరి దశకు చేరాయి. త్వరితగతిన పూర్తిచేయించేందుకు అధికారులను అప్రమత్తం చేశాం. నాణ్యత విషయంలో పర్యవేక్షించాలని అధికారులకు సూచిస్తాం. 2వ నెంబర్ రహదారిలో కొత్త రోడ్డు నిర్మానం కావాలంటే ముందు వాటర్‌లైన్స్ నిర్మాణం పూర్తి కావాలి. వాటర్‌లైన్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జలమండలి ఎండీని కోరాం. త్వరలో ఇందిరానగర్ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతాం.

\- సామల హేమ, కార్పొరేటర్

నాలా ఆక్రమణను అడ్డుకున్న అధికారులు



తార్నాకలో నాలాపై చేపట్టిన నిర్మాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాక స్ట్రీట్ నెంబర్ 1లో చోటు చేసుకున్న నాలా అక్రమణలపై' దర్జాగా నాలా కబ్జా ' శీర్షికన గురువారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్, హైడ్రా సిబ్బంది అక్కడికి చేరుకుని నాలా అక్రమణను అడ్డుకున్నారు. వర్షం నీరు, నాలా లోకి వెళ్లకుండా నాలాపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. నాలాపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దనీ హెచ్చరించారు. ఈ సందర్భంగా తార్నాక వాసులు మాట్లాడుతూ నాలా కబ్జా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి అక్రమణను అడ్డుకునేలా అధికారులను స్పందింపజేసిన సాక్షి దిన పత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



శ్రీచైతన్య విద్యార్థులతో ట్రాఫిక్ పోలీసు అధికారులు

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ విజయపురి కాలనీలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ వివరించారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలి

హిమాయత్‌నగర్: జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డా.కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం వేదిక ఆధ్వర్యంలో 'మేమెంతో మాకంత' వైశ్యుల ఆత్మగౌరవం హక్కుల సాధనకు ఆగస్టు 3న చలో హైదరాబాద్ పేరిట నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే వైశ్య రాజకీయ రణభేరికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు నమశ్శివాయ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ తదితర నాయకులతో కలిసి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో ఎంపీటీసీ 30, జెడ్పీటీసీ 30, జెడ్పీ చైర్మన్ ఒకటి, మేయర్ ఒకటి, మున్సిపల్ చైర్మన్ 15 స్థానాలకు అవకాశం కల్పించాలన్నారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్‌లో వర్గీకరణతో పాటు వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్కిల్ యూనివర్సిటీలో 25 శాతం సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యా సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలన్నారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఆవోప), ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి(ఏసీపీఎస్) సంపూర్ణ మద్దతు తెలపడం అభినందనీయం అన్నారు. వేదిక ప్రతినిధులు ఈశ్వరయ్య, ఉపేందర్, నాగేందర్, నాగరాజు, స్రవంతి, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాడ్‌తో ఆటోడ్రైవర్‌పై దాడి..

సనత్‌నగర్: గొడవపడుతున్న ఇద్దరు మహిళలను శాంతింపజేసిన పాపానికి ఓ మహిళ భర్త రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. మల్కాజిగిరి ఐఎస్‌నగర్ తుకారంగేట్‌కు చెందిన నేనావత్ రమేష్ (25) ఆటోడ్రైవర్. ఈ నెల 29న మధ్యాహ్నం రమేష్ ఫతేనగర్‌లో ఉండే తన సోదరి పార్వతి ఇంటికి వచ్చాడు. అదే సమయంలో సోదరి పార్వతితో పొరుగున ఉండే శారద గొడవ పడడంతో పాటు కొట్టడం చూశాడు. దీంతో ఇరువురికి సర్దిచెప్పి వారిని శాంతింపజేశాడు. అయితే రమేష్‌పై శారద భర్త స్టీల్‌రాడ్‌తో దాడి చేశాడు. వెంటనే అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా తలపై ఏడు కుట్లు పడ్డాయి. తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కాలనీలో భారీ బందోబస్తు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని ఎమ్మెల్యే కాలనీలో వారం రోజులుగా ఆలయానికి సంబంధించి ధర్నాలు, గొడవలు జరుగుతున్న నేపథ్యంలో బంజారాహిల్స్‌లో గురువారం కాలనీకి వెళ్లే అన్ని మార్గాల్లో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మందికి పైగా పోలీసులు బందోబస్తులో ఉన్నారు. కాలనీకి వెళ్లే అన్ని మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అనుమానిత వ్యక్తులను విచారించారు. వాహనాలను పరిశీలించిన తర్వాతే కాలనీలోకి అనుమతించారు.

మోండా మార్కెట్‌లో బెంబేలెత్తిస్తున్న పశువులు

పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో పశువుల సంచారంతో ప్రజలు, వ్యాపారస్తులు బెంబెలెత్తిపోతున్నారు. మూగజీవాల సంచారం కారణంగా ఇటు వ్యాపారస్తులు, అటు కూరగాయాలు కొనుగోలుకు వచ్చే ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు. పశువుల సంచారాన్ని అరికట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జీహెచ్ఎంసీ వెటర్నీ విభాగం యంత్రాంగం స్పందిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆవులు, బర్రెల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నిత్యం వ్యాపారస్తులు భయపడుతున్నారు. పశువుల సంచారం వల్ల మార్కెట్‌లో జరిగే ప్రమాదాలను పట్టించుకునేనాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కసారిగా పశువులు మార్కెట్‌లోకి ప్రవేశించి ...కొన్ని సందర్భాల్లో భీభత్సం సృష్టిస్తున్నాయి. పశువుల యజమానులు దాణా కోసం యథేచ్చగా పశువులను మార్కెట్‌లో వదిలేస్తున్నారు. గతంలో ఓ ఆవు ఓ వ్యక్తిని పొడవడంతో తీవ్రగాయాలకు గురైయినాడు. చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ కన్నుమూశారు. మోండా మార్కెట్‌లో పశువుల సంచారం...ఆగడాల కారణంగా ఇప్పటి వరకు అనేక మంది గాయపడ్డారు. వారానికి ఏదో ఓ రోజు పశువుల కారణంగా ప్రజలు గాయపడుతున్నారు.



రోడ్లపై పశువుల వీరవిహారం

మోండా మార్కెట్ చౌరస్తా, ఇస్లామియా స్కూల్, అజంతా స్వీట్ హౌస్, గాస్ మండి నుంచి సిటీలైట్ హోటల్ వరకు రోడ్లపై పశువులు తిష్ట వేస్తున్నాయి. అదే విధంగా మోండా మార్కెట్ వెనుక భాగం, షోలాపూర్ స్వీట్‌హౌస్, రాజేశ్వర్ థియేటర్ లైన్ మోండా రోడ్లలో పశువులు పెద్ద ఎత్తున సంచరిస్తున్నాయి. అధికారులు నిత్యం తమ సిబ్బందిని ఇక్కడ ఏర్పాటు చేసి పశువుల సంచారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మోండా మార్కెట్ రోడ్లపై పశువుల సంచారం

దశలవారీగా రేషన్‌కార్డుల పంపిణీ

- నేడు రేషనింగ్ సర్కిల్-8 పరిధిలో కార్డుల జారీకి శ్రీకారం..
- ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పంపిణీ
- బాలంరాయి లీ ప్యాలెస్ వేదికగా ఏర్పాట్లు..

సనత్‌నగర్: కొత్త రేషన్‌కార్డుల పంపిణీ వేగవంతంగా జరుగుతోంది. జులై 25న ప్రారంభమైన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ఊపందుకుంది. ప్రత్యేక సమావేశాలను ఏర్పాటుచేసి లబ్ధిదారులకు ప్రత్యేకంగా ముద్రించిన డిజిటల్ కార్డులను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడమే కాకుండా కార్డులు కూడా ఆయా సర్కిళ్లకు పంపించింది. అందులో భాగంగా రేషనింగ్ సర్కిల్-8 పరిధిలో ఆగస్టు 1న (నేడు) ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పెద్ద సంఖ్యలో రేషన్‌కార్డులు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బాలంరాయి లీ ప్యాలెస్ వేదికగా ఈ సమావేశం జరిపి రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. రేషనింగ్ సర్కిల్-8 మూడు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. సనత్‌నగర్ నియోజకవర్గంలో రాంగోపాల్‌పేట, మోండా, బన్సీలాల్‌పేట, బేగంపేట డివిజన్ల వ్యాప్తంగా 22 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అలాగే కంటోన్మెంట్ నియోజకవర్గంలో 31 రేషన్ షాపులు ఉన్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో రెండు డివిజన్లు కవాడిగూడ, భోలక్‌పూర్ డివిజన్లలో 12 షాపులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కిందికి బేగంపేట డివిజన్‌లోని రెండు షాపులు వస్తాయి. ఈ సర్కిల్‌లో మొత్తం 67 షాపులు ఉండగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం దశలవారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి పంపిణీ చేయనున్నారు. శుక్రవారం జరిగే సమావేశంలో ప్రత్యేకంగా ప్రింట్ అయ్యి వచ్చిన దాదాపు 500 కార్డులను పంపిణీ చేయనున్నారు.

మొత్తం దరఖాస్తులు 10,902

ప్రజాపాలన నుంచి మొదలుకొని తాజాగా మీ-సేవా ద్వారా సర్కిల్-8 పరిధిలో 10,902 దరఖాస్తులు వచ్చాయి. రేషనింగ్ సర్కిల్ అధికారులు 4,561 మందిని అన్ని కోణాల్లో విచారించారు. ఇంకా మిగిలిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ కొనసాగుతుంది. విచారణ తంతు పూర్తయ్యాక దశలవారీగా రేషన్‌కార్డుల మంజూరు పత్రాలన పంపిణీ చేస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 10 వరకు రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియను పూర్తి చేసే లక్ష్యంగా రేషనింగ్ అధికారులు ముందుకుసాగుతున్నారు.

సర్కిల్-7 పరిధిలో 6,967 కొత్త రేషన్‌కార్డులు

రేషనింగ్ సర్కిల్-7 పరిధి కిందికి వచ్చే సనత్‌నగర్, అమీర్‌పేటతో పాటు సోమాజీగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్ డివిజన్లలో 81 రేషన్ దుకాణాల పరిధిలో కొత్తగా 6,967 రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. సర్కిల్-7 పరిధిలో కొత్త రేషన్‌కార్డుల కోసం మొత్తం 22,511 దరఖాస్తులు రాగా ఇందులో 6,967 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. దశలవారీగా రేషన్‌కార్డు మంజూరు పత్రాల పంపిణీ చేయనున్నగా శుక్రవారం ప్రారంభించనున్నారు.

ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలో అత్యధిక కేసులు నమోదు



ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జులై మాసంలో అత్యధిక కేసులు నమోదయ్యాయి. స్టేషన్ పరిధి తగ్గిపోయినప్పటికి నమోదు అవుతున్న కేసుల సంఖ్య మాత్రం పెరిగిపోతుంది. 2025 జులై 31 వరకు 120 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. జులై నెలలో వెస్టుజోన్ పరిధిలోనే అత్యధిక కేసులు నమోదు అయిన పోలీస్‌స్టేషన్‌గా ఎస్ఆర్‌నగర్ మొదటి స్థానంలో నిలిచింది. గతంలో మధురానగర్, బోరబండ ప్రాంతాలు ఎస్ఆర్‌నగర్ స్టేషన్ పరిధిలో ఉన్న సమయంలో ఒక్క నెల వ్యవధిలో 31 కేసులు నమోదు చేసిన రికార్డు ఎస్ఆర్‌నగర్‌కు ఉంది. కాగా జులై 1 ,2వ తేదీన జరిగిన బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ వేడుకల సందర్భంగా వివిధ సంఘటనలకు సంబంధించి 19 కేసులు నమోదు కావడం విశేషం.

వేర్వేరు ఘటనల్లో ... రైలుకిందపడి ఇరువురి ఆత్మహత్య



మహేశ్, ధనుశ్ (ఫైల్)

సికింద్రాబాద్: రెండు వేర్వేరు ఘటనల్లో ఇరువురు వ్యక్తులు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సికింద్రాబాద్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు కథనం ప్రకారం... నేరేడ్‌మెట్ వినాయక్‌నగర్‌కు చెందిన పెరిక మహేశ్ (43) వృత్తి ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మహేశ్ మూర్ఛ వ్యాధితో బాధపడుతుండడంతోపాటు, మానసిక పరిస్థితి బాగుండడం లేదు. ఇందుకు తీవ్ర మనస్తాపం చెందిన మహేశ్ బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని అప్‌మెయిన్ లైన్ వద్దకు చేరుకుని వేగంగా వస్తున్న రైలుబండికి ఎదురెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

మరోఘటనలో.....

సికింద్రాబాద్ జేమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రాక్ వద్దకు గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో చేరుకున్న ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు వివరాల మేరకు.... ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడిని తన సెల్‌ఫోన్ సిమ్‌కార్డు ఆధారంగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నాగాపూర్ గ్రామస్తుడు సింగారె ధనుశ్ (30) గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలో.. రూపాయల్లో.. టమాటా.39, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 28, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఏసీఈ-2025 అవార్డును అందుకున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఏసీఈ-2025 అవార్డును అందుకున్నారు. గురువారం గురుగ్రామ్‌లో జరిగిన ఆల్ ఇండియా సర్క్యులర్ ఎకానమి నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత విద్యలో ప్రమాణాలకుగాను అవార్డు లభించినట్లు ఓయూ అధికారులు తెలిపారు. ప్రతి రోజు 2 టన్నుల వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి కాలుష్య రహితంగా పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రొ.అన్సారీకి న్యాయం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీకి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సమావేశమైన 13 విద్యార్థి సంఘాల నాయకులు పింఛన్, రిటైర్డ్ బెనిఫిట్స్ కోసం ప్రొ.అన్సారీ చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. 2023లో ఉద్యోగ విరమణ చేసిన ప్రొ.అన్సారీని పింఛన్ కోసం కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం అన్యాయమన్నారు. అన్సారీకి పింఛన్ చెల్లించాలని మైనార్టీ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కూడా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, బీఆర్ఎస్‌వీ, టీజీఎస్‌యూ, ఎస్ఎస్‌యూ, ఎస్‌టీఎస్‌ఏ, ఏఐఓబీసీఎస్‌ఏ, ఎస్ఎస్ఎఫ్, ఏఏస్‌ఏ,ఐఎస్‌ఏ, ఎంఎస్ఓ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు పలువురి వినతిపత్రం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉపముఖ్యమంత్రి సీఎం మల్లుభట్టి విక్రమార్కకు ఓయూ అధ్యాపకులు, మాల జేఏసీ నాయకులు గురువారం వినతి పత్రాలు సమర్పించారు. సీపీఎస్‌ను అమలు చేయాలని ఓయూ అధ్యాపకులు విజ్ఞప్తి చేయగా... ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరిగిందని, మాలలకు 7 శాతం రిజర్వేషన్లను పెంచాలని, రిజర్వేషన్ల విభజనకు ముందుగా నోటిఫికేషన్ వెలువడినందున పీహెచ్‌డీ అడ్మిషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకూడదని ఓయూ అధికారులకు ఆదేశించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

రేపు బీసీల మహాధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఇందిరా పార్కు వద్ద శుక్రవారం జరిగే బీసీల మహాధర్నాకు తరలిరావాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగంటి రాజు నేత పిలుపు నిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నిల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్‌తో ధర్నాను చేపట్టిన్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలంరాయి క్లాసిక్‌గార్డెన్ సమీపంలో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెట్రోలింగ్ సిబ్బంది 108 వాహన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని సదరు వ్యక్తిని పరిశీలించగా మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. అయితే మృతునికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 60-65 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని పోలీసులు తెలిపారు.